అయ్యా..అవకాశమివ్వండి



‘ అయ్యా.. ఒక్క అవకాశం ఇవ్వండి (కోరుకున్న చోట పోస్టింగ్ ఇప్పించండి).. మీరు చెప్పినట్టే వింటాం.. మీ కనుసనల్లోనే నడుచుకుంటాం...మీకు తెలియకుండా ఏ పనీ చేయం..’ అంటూ ఉద్యోగులు అమాత్యుల చుట్టూ తిరుగుతూ కాళ్లావేళ్లా పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2024 జూలై 31 నాటికి ఒకచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారికి తప్పనిసరి బదిలీకి మార్గం సుగమం చేసింది. మొత్తం 12 శాఖల్లోని బదిలీలు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సిఫార్సు లెటర్లకు భలే డిమాండ్ ఉంటోంది. తమకు నచ్చిన స్థానాలను దక్కించుకునేందుకు ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్సు లేటర్ల కోసం ప్రదక్షిణలు మొదలుపెట్టారు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా మెలిగే మండల స్థాయి నేతలు కొందరు బదిలీలపై భరోసా ఇస్తున్నారు. ఉద్యోగులకు మాటిస్తూ కొంతమేర కార్యకలాపాలు సాగిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో అజమాయిషీ చేస్తూ ఉద్యోగుల బదిలీల్లో కొందరు చక్రం తిప్పుతున్నారు.

– రాయదుర్గం:

సార్.. కాస్త కనికరం చూపండి.. ఒక్క ఛాన్స్ ఇస్తే మీరు చెప్పినట్టే వింటాం

- మీరు చెప్పినట్టే వింటాం.. మీకు తెలియకుండా ఏ పనీ చేయం
- అమాత్యుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఉద్యోగులు
- ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- సిఫార్సు లెటర్లకు భలే డిమాండ్
- కనీసం డిప్యూటేషన్ అయినా ఇవ్వాలని పట్టు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 15 మండలాలు, రెండు అర్బన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, కూడేరు, శెట్టూరు, కంబదూరు, కుందుర్పి, బెళుగుప్ప పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌కు భలే డిమాండ్ ఉంది. ఒక్కో స్టేషన్‌కు ముగ్గురి నుంచి నలుగురు పోటీలో ఉన్నట్టు సమాచారం. డి హీరేహాళ్‌లో ఎన్నికలకు ముందు విధుల్లోకి వచ్చిన ఎస్‌ఐ ఇక్కడే ఉండిపోయారు. దీంతో ఆయన బదిలీ లేనట్టేనని తెలుస్తోంది. ఈ యువ ఎస్‌ఐ ఈస్థానానికి పోటీపడి చివరగా పక్క మండలం సర్దుకోవాల్సి వచ్చింది.ఎమ్మెల్యే, మంత్రి ఆశీస్సులున్న కొందరు త్వరలో ఈ స్థానాల్లో కొలువుదీరనున్నట్టు చర్చ సాగుతోంది. ఏదిఏమైనా ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకతకే పెద్దపీట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పదేళ్లు ఒకేచోట పాతుకుపోయారు..

ప్రభుత్వం ఏదైనా సరే తమ పరపతి ఉపయోగిస్తూ పదేళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కొందరు ఉన్నారంటే అతిశయోక్తిలేదు. రాయదుర్గం నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఆర్‌ఐ అదే కార్యాలయంలో వీఆర్వో, అక్కడే జూనియర్ అసిస్టెంట్, ప్రస్తుతం ఆర్‌ఐగా ఇలా 15 ఏళ్లకు పైగా పాతుకుపోయారు. ఓ డీటీ కూడా సుమారు 20 ఏళ్లు ఈ ప్రాంతంలోనే సేవలందిస్తున్నారు. పంచాయతీరాజ్‌లోనూ కొందరు అలాంటి వారే దర్శనమిస్తున్నారు. మళ్లీ ఈ ఐదేళ్లు ఇక్కడే కొనసాగేలా నేతలచుట్టూ పైరవీలు సాగిస్తున్నారు. లెటర్ల కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. పోస్టింగ్ వేరే చోట వచ్చినా డిప్యూటేషన్‌పై ఇక్కడే కొనసాగేలా చక్రం తిప్పుతున్నారు. తమకు నచ్చని అధికారి వచ్చినా కూటమి నేతలకు చెప్పి అడ్డుకుంటున్నారు. రాయదుర్గం తహసీల్దార్ అలెగ్జాండర్‌కు ఆ భంపాటే ఎదురైంది. కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరకుండా కొందరు అడ్డుకున్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి

- కూడేరు ఎంపీపీ నారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రోటోకాల్ ప్రకారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ నారాయణ రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా అధికారులు పలు అంశాలకు సంబంధించి సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుబ్బమ్మ , సర్పంచ్ ధనుంజయ మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినప్పుడు తమకు సమాచారం ఇవ్వకపోతే ఎలా ? అని నిలదీశారు. ప్రభుత్వం మారితే వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులను విస్మరిస్తారా ?అని ఎంపీపీ ప్రశ్నించారు. కూడేరు పశు వైద్యాధికారి రాకుండా చోళసముద్రం పశువైద్యాధికారిణి శ్వేత సమావేశానికి హాజరు కావడంతో వైస్ ఎంపీపీ దేవా అసహనం వ్యక్తం చేశారు. సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని, కూలీలందరికీ పనులు కల్పించాలని కోరారు. ఎంపీడీఓ విజయ లలిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, డాక్టర్ లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏఓ విజయ కుమార్, ఈఓఆర్డీ లక్ష్మీనారాయణమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేష్



ఉరవకొండ వద్ద గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీడీ డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకా వేయించాలని, ఇందులో పశుపోషకులు నిర్లక్ష్యం చేయొద్దని పశుసంవర్ధక శాఖ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఉరవకొండ పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాయదుర్గం:పశువులకు రైతులు టీకా వేయించాలని పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపా రు. మంగళవారం వడ్రహొన్నూరు, జుంజురంపల్లి, కెంచానపల్లి, కాశీపురం, మలకాపురం గ్రామాల్లో సుమారు 830 పశువులకు గాలికుంటు టీకా వేసినట్టు ఆయన వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: పశువులకు ముందస్తుగా టీకా వేయిస్తే గాలి కుంటు వ్యాధి రాకుండా అరికట్టవచ్చని చోళసముద్రం పశు వైద్యాధికారిణి శ్వేత అన్నారు. మంగళవారం మండలంలోని పి.నారాయణపురంలో గాలికుంటు వ్యాధి టీకా వేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు ఎర్రిస్వామి , సర్దార్ బాషా పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



కణేకల్లు పోలీసుస్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

కణేకల్లు: కోకుర్తి గ్రామ శివారులో వేదవతి హగరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కూటమి పార్టీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి రాత్రి వేళలో టీడీపీ నాయకులు ఇసుక అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సెబ్ సీఐ మురళీకిశోర్, ఎస్‌ఐ ప్రసాద్‌రావు మంగళవారం రాత్రి కాపు కాసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇది ఇలా ఉండగా తమ ట్రాక్టర్లను అధికార టీడీపీకి చెందిన మరో వర్గం వారే సెబ్ అధికారులకు సమాచారమిచ్చి పట్టించారని ఇసుకాసురులు వారిపై చిందులేశారు.

విడపనకల్లు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను విడపనకల్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ మంగళవారం సీజ్ చేశారు. బొమ్మనహాళ్ నుంచి విడపనకల్లుకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘జలజీవన్’ సర్వే పూర్తి చేయండి

గుమ్మఘట్ట: జలజీవన్ మిషన్ పథకం సర్వేను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పూర్తి చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సర్వేయర్లు, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి కొళాయి కనెక్షన్ ఉందా? లేదా అని వివరాలు సేకరించి, నమోదు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, డీటీ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, ఉపాధి ఏపీఓ సురేశ్, వెలుగు ఏపీఎం కళానాయక్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



నేమకల్లులో సాగు చేసిన అయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానఅధికారి మౌనిక

బొమ్మనహాళ్: నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేసే రైతులు ఎక్కువ లాభాలు పొందొచ్చని రాయదుర్గం ఉద్యాన శాఖ అధికారిణి మౌనిక తెలిపారు. మంగళవారం మండలంలోని నేమకల్లులో సాగు చేసిన ఆయిల్‌పామ్ మొక్కలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లో ఆయిల్‌ఫామ్ పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఆయిల్‌పామ్ తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువ అన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల అనంతరం ఏటా ఎకరానికి 8 నుంచి 12 టన్నుల ఆయిల్ పామ్ కాయల దిగుబడి వస్తాయన్నారు. అయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులకు మొక్కలకు ఏర్పాటుకు 70 నుంచి 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం..నీటమునిగిన పంటలు



కణేకల్లు శివారులోని వేదవతి హగిరిలో పొంగి పొర్లుతున్న వరదనీరు



కంబదూరు వద్ద నీట మునిగిన టమాట పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ గౌసియా

రాయదుర్గంటౌన్ : నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. రాయదుర్గంలో 54.2 మిల్లీ మీటర్లు(5.4 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. అర్ధ రాత్రి దాటిన తర్వాత 3 గంటల నుంచి దాదాపు గంటపాటు వర్షం దంచికొట్టింది. రామస్వామివీధి, కొలిమివీధి, నేసేపేట, మధు టాకీస్‌లోని లోతట్టు కాలనీలు ముంపునకు గురయ్యాయి. పట్టణంలోని గోసాబావి వీధిలో మంజుల, రామకృష్ణకు చెందిన మట్టిమిద్దె పాక్షికంగా (పైకప్పు) కూలింది. రాయదుర్గంలోని నాగిరెడ్డిపల్లిలో శిల్పకు చెందిన మట్టి మిద్దె, చదంగొల్లలదొడ్డిలో నాగప్పకు చెందిన ఇంటి సైడ్ వాల్ పాక్షికంగా కూలాయి.

కణేకల్లు: కణేకల్లు మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. 34 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మాల్యం, సొల్లాపురం, ఆదిగానిపల్లి, రచ్చుమర్రి, పుల్లంపల్లి, సొల్లాపురం గ్రామాల్లో వర్షం కురిసింది.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా వున్న గ్రామాల్లో మంగళవారం రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురిసింది. 24.9 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురు గాలులకు గోనబావి గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఎస్.హొసళ్లి వద్ద మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునగడంతో రైతులు నష్టపోయారు. నేత్రపల్లి సమీపంలోని జాలికుంట వర్షపు నీటితో నిండింది. భూపసముద్రం బచ్చేటి చెరువుకు వరద నీరు వచ్చి చేరింది.

శెట్టూరు: మండలంలో కురిసిన వర్షానికి ములకలేడులో రైతు ఓబుళనాయుడుకు చెందిన మిరపతోట నీటమునిగింది. రూ. లక్ష వరకు నష్టపోయినట్లు రైతు తెలిపాడు. అనుంపల్లిలో టమాట, మామిడి మొక్కలు నీటమునిగాయి. కనుకూరు, అనుంపల్లి, ములకలేడు గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిండాయి.

ఉద్యాన పంటల పరిశీలన

కంబదూరు: మండలంలో సోమవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. మండలంలోని చెరువుల్లోకి నీరు చేరింది. చెక్ డ్యాంలు నిండి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. నూతిమడుగు, జెక్కిరెడ్డిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో సాగైన టమాట, వంకాయి పంటలు నీట మునిగిపోయాయి. దీంతో రైతులు నష్టపోయారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలను ఉద్యాన అధికారిణి గౌసియ పరిశీలించారు.

విడపనకల్లు: మండలంలో గడేకల్లు, పాలికి, హంచనహాల్, పాల్తూరు, విడపనకల్లు తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. హంచనహాల్, పాలికి, ఉంబండ, పాల్తూరు దర్గా హొన్నూరుకు వెళ్లే రోడ్డుపై వంకలు వరదనీటితో పోటెత్తాయి.

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప, నక్కలపల్లి, గంగవరం గ్రామాల్లో సోమవారం రాత్రి 30.6 ఎంఎం వర్షం కురిసింది. భారీ వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను హెచ్ఓ కృష్ణతేజ, ఎంపీఈఓ శిల్ప మంగళవారం పరిశీలించారు. నక్కపల్లిలో రామిరెడ్డి, ఇతర రైతులు సాగు చేసిన బీర పంట దెబ్బతినింది. బెళుగుప్ప, గంగవరం గ్రామాల్లో మామిడి, అరటి పంటలను పరిశీలించారు.

కూడేరు: మండలంలో మంగళవారం వేకువజామున వరకు భారీ వర్షం కురిసింది. 37 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నెమళ్ల వేటగాళ్లపై చర్యలు తీసుకోండి



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్ణలతకు వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

కణేకల్లు: మండల కేంద్రంలోని రామనగర్ కబరస్తాన్ (శ్మశానవాటిక)లోని నెమళ్లను వేటాడేవారిపై చర్యలు తీసుకోవాలని నూరానీ మసీద్ ముతవల్లి హుసేన్‌సాబ్, ముస్లింలు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్ణలతను కోరారు. మంగళవారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను కలిసి ముస్లింలు వేటగాళ్లపై నిఘా ఉంచాలన్నారు. వందలాదిగా ఉన్న నెమళ్ల రోజురోజుకూ అంతరించిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

త్వరితగతిన పూర్తి చేయండి

గుమ్మఘట్ట: ఆగిపోయిన మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోనబావిలో 2017లో మంజూరై అర్ధంతరంగా ఆగిన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహయాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సచిన్, కార్తీక్, యశ్వంత్, ఉమేష్, నవీన్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులు సరికాదు

రాయదుర్గంటౌన్: మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, బాల్య వివాహాలను అరికట్టాలని ఏపీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి, పద్మావతి డిమాండ్ చేశారు.మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ విద్యార్థి యువజన సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థుల భవిష్యత్తు అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్ పాల్గొన్నారు.

జైభీమ్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

ఉరవకొండ: స్థానిక నాల్గో వార్డు మాలవీధి వద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జై భీమ్ యువజన సంఘం నూతన తాలుకా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకమిటీలో తాలుకా గౌరవ అధ్యక్షుడిగా తంబన్న, అధ్యక్షుడిగా మాల లేపాక్షి, ఉపాధ్యక్షుడిగా సోమశేఖర్, కార్యదర్శిగా ఎంఎం రాజేష్, సహాయ కార్యదర్శిగా గాజుల తేజ, కోశాధికారిగా గంగోల రాజు, ఈసీ సభ్యులుగా సూర్యనారాయణ, మోహన్, కిష్ణ, బాలు, సునీల్, అశోక్, అజిత్ ఎంపికయ్యారు.

హెచ్ఎల్‌సీకి పైపింగ్



పైపింగ్ పూడ్చివేస్తున్న అధికారులు

రాయదుర్గం(డి హీరేహాళ్): డీ హీరేహాళ్ మండలంలోని నాగలాపురం – చెర్లోపల్లి మధ్య హెచ్ఎల్‌సీ కాలువకు మంగళవారం పైపింగ్ పడింది. వెంటనే గుర్తించిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ హెచ్ఎల్‌సీ ఏఈ అల్తాఫ్ అక్కడి చేరుకున్నారు. గంటల వ్యవధిలో దాన్ని అరికట్టారు.

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం



రాయదుర్గంలో దోమల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డు కేరమ్మకట్ట, గొగ్గిగరట్టి ఏరియాల్లో దోమల నివారణ దినోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శానిటరీ సెక్రటరీ ఓంకార్, హెల్త్ సెక్రటరీ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత అవసరమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. మంగళవారం శ్రీధరఘట్ట, లింగదహాళ్, హరేసముద్రంలో అవగాహన ర్యాలీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి పాల్గొన్నా రు.

విడపనకల్లు: దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు విడపనకల్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్ప తెలిపారు. మంగళవారం ఏపీ మోడల్ స్కూల్లో దోమల బెడదపై డాక్టర్ పుష్ప అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ,ప్రిన్సిపాల్ గంగాధర్‌పాల్గొన్నారు.

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి బయటపడొచ్చని గడేహోతూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి ఎం .పద్మా తెలిపారు. మంగళవారం ధర్మపురి లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్ పావని, ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్, సూపర్ వైజర్ కుమారస్వామి, హెల్త్‌అసిస్టెంట్ చంద్రా, ఏఎన్ఎం ఇందిరమ్మ పాల్గొన్నారు.

నేడు న్యాక్ బృందం రాక

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 21, 22 తేదీల్లో న్యాక్ బృందం సందర్శించనునున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు హాజరై, కళాశాల అభివృద్ధికి సూచనలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

బీఎల్వోలు అందుబాటులో ఉండాలి

కళ్యాణదుర్గం: గ్రామాల్లో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ప్రతి బీఎల్వో తప్పక అందుబాటులో ఉండాలని తహసీల్దార్ భాస్కర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల డీటీ వెంకటేశులు, డీటీ నాగరాజుతో కలిసి ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఫారం–6,7,8 లపై ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ ఆదినారాయణ, సూపర్ వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పక్కగా చేపట్టాలి

బ్రహ్మసముద్రం: బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ సుమతి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ఉరవకొండలో మాట్లాడుతున్న రైడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ రైడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మీకు తెలుసా? అంటూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. రైడ్స్ కళ్యాణదుర్గం ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఐసీటీసీ కంట్రోలర్ రవిప్రసాద్ మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందుతుంది.. మహమ్మారి సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, రైడ్స్ సంస్థ సభ్యులు షకీలా, మౌనిక, రేణుక, పద్మ, సంధ్య, నీలావతి, అను పాల్గొన్నారు.

ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: హెచ్ఐవీ, సుఖవ్యాధులు, టీబీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం 74 ఉడేగోళం గ్రామంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధుల నియంత్రణ, అవగాహనపై సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు.

న్యాక్ బృందం పరిశీలన



కళాశాల అధ్యాపకులతో న్యాక్ సభ్యులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. పరిశీలించిన ముగ్గురు సభ్యుల్లో చైర్మన్ ప్రొఫెసర్ శంకర ఈశ్వర్ పాటిల్, సభ్యులు కరోట్టుపురం, ప్రొఫెసర్ నిరంజన్‌రావు ఉన్నారు. బోధనా పద్ధతులు, పరిశోధనలు, సదుపాయాలు, పరిపాలనా అంశాలపై సమగ్ర వివరాలు సేకరించారు. కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ బోధనా పద్ధతుల్లో చేస్తున్న మార్పులను అడిగి తెలుసుకున్నారు. కాగా, 2016లో కళాశాలకు బీ గ్రేడ్ దక్కిందని, ఈసారి కచ్చితంగా ఏ గ్రేడ్ వస్తుందనే ఆశాభావాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

26న స్త్రీల ఆధ్యాత్మిక సదస్సు

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ మినిస్ట్రీస్‌లో ఈనెల 26న బైబిల్ బోధనలపై స్త్రీల ఆధ్యాత్మిక సదస్సు జరుగుతుందని పాస్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేఎస్‌సీసీ క్రైస్ట్ చర్చి స్త్రీల మైత్రి సభ్యులతో మంగళవారం జరగనున్న సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు సదస్సు జరుగుతుందన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

విడపనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

తెగిపోయిన కల్వర్టు పరిశీలన

శెట్టూరు: మండలంలోని అనుంపల్లిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువు నిండి మరువపారింది. నీటి ఉధృతితో అనుంపల్లి నుంచి ములకలేడుకు వెళ్లే నిర్మాణంలో ఉన్న ప్రధాన దారి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ప్రతి పంట నమోదు చేయండి

కుందుర్పి: ఖరీఫ్‌లో రైతులు మెట్టభూముల్లో సాగు చేసిన ప్రతి పంటనూ ఈక్రాప్ నమోదు చేయాలని ఏఓ మహేష్ సూచించారు. మంగళవారం కుందుర్పి,బండమీదపల్లి తదితర గ్రామాల్లో ఆర్‌బీకే సిబ్బంది చేపడుతున్న ఈక్రాప్ నమోదును ఏఓ పరిశీలించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

వజ్రకరూరు: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని చాబాల సర్పంచు మల్లెల జగదీష్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పూసుల నరేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చాబాల ప్రాథమిక పాఠశా లలో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం రాజేష్, ఉపాధ్యాయులు శ్రీధర్ పాల్గొన్నారు.

ఈఓఆర్డీకి సన్మానం



బ్రహ్మసముద్రం ఈఓఆర్డీ వెంకటనాయుడును సన్మానిస్తున్న ఎంపీడీఓ దాసానాయక్, ఉద్యోగులు

బ్రహ్మసముద్రం : ఆగస్టు 15న ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఈఓఆర్డీ వెంకట్‌నాయుడు ను ఎంపీడీఓ దాసానాయక్, పంచాయతీరాజ్ ఉద్యోగులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ నందకిశోర్, అచ్యుతానంద, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు అవినాష్, పండరీష్, మంజునాథ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 మంది కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక

ఉరవకొండ: స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణ మంటపంలో ధర్మవరం రోటరీ క్లబ్ సౌజన్యంతో ఉరవకొండ చౌడేశ్వరీదేవి వీవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారు కంటి వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ ప్రియా, డాక్టర్ శివశంకర్ వంద మందికి కంటి పరీక్షలు చేసి, 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. తొగటవీరక్షత్రియ కళ్యాణ మంటపం ఇన్‌చార్జ్ పెద్దకొట్ల రవి, చేనేత నాయకులు గట్టు ఎర్రిస్వామి, కమీటి సభ్యులు గుర్రం హరిదాస్, వెంకటేసులు, కటికం మల్లేసి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత టీకా

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఈనెల 21 నుంచి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకా వేయనున్నట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు.

పంటలు దెబ్బతినకుండా జాగ్రత్త వహించండి

కూడేరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు తేమ అధికమై ఆముదం, మొక్క జొన్న తదితర పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు వహించాలని ఏఓ విజయకుమార్ సూచించారు. మంగళవారం ఆయన గొటుకూరు, పి.నారాయణపురంలో పర్యటించారు. అధిక తేమకు ఆముదం, మొక్కజొన్న పంటలకు గాలి సోకక, తెగుళ్లు సోకితే ఎకరాకు 200 లీటర్ల నీటికి 4 కేజీల యూరియా గాని లేదా పొటాషియం నైట్రేట్‌ను 200 లీటర్ల నీటికి కేజీ కలిపి వారం రోజుల వ్యవధిలో మొక్కలపై పడేలా 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ పుల్లప్ప, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

బెళుగుప్ప: సూక్ష్మ బిందు పరికరాల మంజూరుకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం రామసాగరం గ్రామంలో ఎంఐఏఓ మల్లేష్, నెటాఫిమ్ డ్రిప్ కంపెనీ డీలర్ మారుతితో కలసి గ్రామంలో డ్రిప్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివరాలకు ఎంఐఏఓ సెల్: 7995010059లో సంప్రదించాలన్నారు.

యువకుడి ఆత్మాహత్యాయత్నం

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో అశోక్ అనే యువకుడు ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి బోయ తిమ్మప్ప,లక్ష్మక్క దంపతుల కుమారుడు అశోక్ బెంగళూరుకు వెళ్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం మద్యం మత్తులో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కి ఆత్మాహత్యాయత్నం చేశాడు. పైనుంచి కింద పడడంతో కాళ్లుచేతులకు తీవ్ర గాయాలయ్యాయి.మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.